# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people




## మైనర్ బాలికపై లైంగిక దాడి..

### ఆత్మహత్యకు కారకుడైన కామాంధుడికి యావజ్జీవ శిక్ష

- రూ.10 వేల జరిమానా విధించిన భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి
- విచారణ జరిపిన పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ

04

బుధవారం 23, సెప్టెంబర్ 2026 సంపుటి : 03 సంచిక : 204 పేజీలు : 05 వెల ₹5

## తోపులాట

### భవనాలకు పెచ్చులు ఊడటాన్ని పరిశీలించేందుకు ఎంజీఎంకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

- అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు
- బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య పెనుగులాట
- ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కాలుకు గాయం
- ఎంజీఎం వద్ద బీఆర్ఎస్ ఆందోళన..ఉద్రిక్తత

05





- ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసిన 881 మంది అభ్యర్థులు
- కొనసాగుతున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- ఊపందుకున్న పైరవీలు.. రంగంలోకి దళారులు
- పది మార్కుల ఇంటర్వ్యూ కోసం రూ.3 లక్షల రేటు
- భూపాలపల్లి జిల్లాలో ఓపెన్ గా సాగుతున్న దళారుల దందా!


04

## బేరసారాలు!

### 41 అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అంగన్వాడి టీచర్ల నియామకం కోసం బేరసారాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఒక్కో టీచర్ పోస్ట్ కోసం రూ.2 నుంచి రూ.3 లక్షల డిమాండ్ పలుకుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అంగన్వాడి టీచర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో కొందరు మధ్యవర్తుల ద్వారా అవగాహన కుదుర్చుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. భూపాలపల్లి జిల్లాలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో ఖాళీగా ఉన్న 41 అంగన్వాడి టీచర్ పోస్టుల కోసం గత ఆగస్టు 20న సంక్షేమ శాఖ నుంచి నోటిఫికేషన్ వెలువడింది. ప్రభుత్వాన్నిబంధనలో ప్రకారం ఈ 41 అంగన్వాడి టీచర్ల పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులకు కేటగిరి వారిగా రిజర్వ్ చేశారు. గత ఆగస్టు 21 నుంచే ఐసీడీఎస్ మహాదేవపూర్ ప్రాజెక్టు పరిధిలో 29, భూపాలపల్లి ప్రాజెక్టు పరిధిలో 12 అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 2న సాయంత్రం 5 గంటలకు ముగిసింది. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు రెండు ప్రాజెక్టుల పరిధిలో 881 మంది అంగన్వాడీ టీచర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేశారు.

– అక్షరదర్బార్, హనుమకొండ



## గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

- జీడబ్ల్యూఎంసీ పరిధిలో సుమారు 19 ప్రధాన చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు
- అందుబాటులో 30 క్రేన్లు, 145 మంది గజ ఈతగాళ్లు, 500 మంది సిబ్బంది
- పర్యవేక్షణకు ఇంఛార్జిల నియామకం

04

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బల్దియా కమిషనర్ టి వెంకన్న తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రత, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

- అక్షరదర్బార్, వరంగల్

# మరణంలోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ దంపతుల దుర్మరణం
- చికిత్స పొందుతూ భర్త రవీందర్ మృతి
- లెంకాలపల్లిలో విషాదం



అక్షర దర్బార్, నల్లబెల్లి : మరణంలోనూ విడిపోని సర్పంచ్ దంపతుల దాంపత్య బంధాన్ని చూసి నల్లబెల్లి మండల వాసులు కన్నీరు మున్నీరవుతున్నారు. రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ దంపతులు అకాల మరణం చెందిన విషాద ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లెంకాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నల్లబెల్లి మండలం లెంకాలపల్లి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ దంపతులు కస్తూరి విజయలక్ష్మి, రవీందర్‌లు ఈనెల 16వ తేదీన తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి నర్సంపేట నుండి నల్లబెల్లి మీదుగా స్వగ్రామం చేరుకునే క్రమంలో నర్సంపేట మండలం ఇటుకలపల్లి గ్రామ శివారులోని బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి (45) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త కస్తూరి రవీందర్ (51) తీవ్రగాయాలతో అపస్మారక స్థితికి వెళ్లడంతో, గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆయన్ను వరంగల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవీందర్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ దంపతుల మృతితో లెంకాలపల్లి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాన్ని పరామర్శించేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరుకుని కన్నీటి వీడ్కోలు పలికారు. సర్పంచ్ దంపతుల మృతి పట్ల పలువురు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# ఘనంగా కుంకుమ పూజ..

- మహిళలకు చీరల పంపిణీ
- బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంగళవారం కుంకుమ పూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్న మహిళలకు చీరలు బహుకరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న హిందూ వాదులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు ఆకుల లక్ష్మణ్, మెంతుల సురేష్, ఆకుల శ్రీకాంత్, వెంకటేష్, రాకేష్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు



# టీఎల్ఎస్ఏ ములుగు జిల్లా అధ్యక్షుడిగా జన్ను నవీన్

- న్యాయ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



అక్షరదర్బార్, వెంకటాపూర్ : ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన జన్ను నవీన్ తెలంగాణ లీగల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎల్ఎస్ఏ) ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలు నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ సతీష్‌లు నవీన్‌ను అభినందిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ న్యాయ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సామాజిక, న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించడం, జ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- ఈ నెల 30 ఆఖరు తేదీ: ఏఈవో మహిపవన్



అక్షర దర్బార్, వెంకటాపూర్ : నల్లగుంట క్లస్టర్ పరిధిలోని రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను పొందాలంటే సెప్టెంబర్ 30 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఈవో మహిపవన్ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే ఎరువుల బుకింగ్, హెల్త్ కార్డులు, పీఎం కిసాన్, రైతు భరోసా, పంట విక్రయాలతో పాటు వ్యవసాయ శాఖ ద్వారా అందే రాయితీలు, ఇతర ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కావున రైతులు తమ ఆధార్ కార్డు, దానికి లింక్ అయిన మొబైల్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకాన్ని తీసుకుని స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద గానీ, సమీపంలోని సీఎస్‌సీ, మీసేవ కేంద్రాలలో గానీ సంప్రదించి గడువులోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

# మైనింగ్‌కు రూ.10 లక్షల డిమాండ్?

- సర్పంచ్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ కాంట్రాక్టర్ ఆరోపణ..
- అనుమతుల మేరకే పనులు చేస్తామని వెల్లడి

అక్షర దర్బార్, నడికూడ: నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ పరిధిలోని సాకరిగుట్టలో మైనింగ్ పనులకు స్థానిక సర్పంచ్ అడ్డంకులు సృష్టిస్తూ రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్నారని క్రీస్తు జ్యోతి కాంట్రాక్టర్ బరిగెల కుమారస్వామి ఆరోపించారు. బరిగెల రాధికతో కలిసి క్రీస్తు జ్యోతి పేరుతో కాంట్రాక్ట్ తీసుకుని, సుమారు మూడు ఎకరాల్లో టెండర్ ద్వారా మైనింగ్ అనుమతులు పొందినట్లు తెలిపారు. అనుమతులకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు టిప్పర్లతో రహదారికి మొరం పోస్తుండగా స్థానిక సర్పంచ్ కొంగంటి తిరుపతి అడ్డుకుని, గ్రామస్తులను రెచ్చగొడుతున్నారని కుమారస్వామి పేర్కొన్నారు. చుట్టుపక్కల రైతులకు ఇబ్బందులు కలుగుతాయంటూ తమపై ఒత్తిడి తెస్తూ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.

## నష్టం జరగకుండా బాధ్యత తీసుకుంటాం

మైనింగ్ పనుల వల్ల చుట్టుపక్కల రైతులకు, గుట్టపై ఉన్న దేవాలయాలకు, సమీపంలోని వాగుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పూర్తి బాధ్యత తీసుకుంటామని కాంట్రాక్టర్ తెలిపారు. తమకు మంజూరైన అనుమతుల పరిధిలో, నిర్దేశించిన హద్దులు దాటకుండా మాత్రమే పనులు చేపడతామని స్పష్టం చేశారు. గ్రామస్తులు వాస్తవాలను గమనించి తమకు సహకరించాలని కుమారస్వామి కోరారు.




# వరికోల్ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి

- హెచ్‌ఎం పోస్టును భర్తీ చేయాలని పేరెంట్స్ కమిటీ వినతి

**అక్షరదర్బార్, నడికూడ:**

నడికూడ మండలంలోని వరికోల్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు పూర్తిస్థాయి ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరారు. పాఠశాల నిధుల వ్యవహారానికి సంబంధించి ఉపాధ్యాయుల మధ్య ఏర్పడిన వివాదాల నేపథ్యంలో హెచ్‌ఎం బెల్లంకొండ శరత్‌గౌడ్, ఉపాధ్యాయుడు అశోక్ బదిలీపై వెళ్లడంతో పాఠశాలలో తీవ్ర ఉపాధ్యాయ కొరత ఏర్పడిందని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను కేటాయించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో ఒకరికి హెచ్‌ఎం బాధ్యతలు అప్పగించాలని ఎంఈఓకు సమర్పించిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. పాఠశాల అభివృద్ధి, నిధుల వినియోగంపై తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీకి పారదర్శకంగా సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# నిమజ్జనం వేళ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

- తోపుకుంటను పరిశీలించిన సీఈ కె.గౌతమ్ రెడ్డి

అక్షరదర్బార్ , ములుగు: ములుగు సర్కిల్ నోడల్ ఆఫీసర్, ఆపరేషన్2 చీఫ్ ఇంజనీర్ (సీఈ) కె. గౌతమ్ రెడ్డి మంగళవారం ములుగులో పర్యటించారు. ఈ సందర్భంగా ములుగులోని తోపుకుంట వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టాలని, ఊరేగింపు మరియు



నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు సర్కిల్ ఎస్ఈ (ఆపరేషన్స్) బి. బిక్షపతి, డీఈ టెక్నికల్, డీఈ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ కన్నారాజు, ఏడీఈ ములుగు, ఏఈ ములుగుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# మాకు పింఛన్లు రావా!

- అంకుషపురం గ్రామంలో మాయమైన "చేయుత "పాత దరఖాస్తులు.
- మొగుళ్ళపల్లిలో అనర్హుల ఎంపిక..?

అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్జీదారులకు వేదన మిగులుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8,050 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కొత్తగా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అర్జీలు తీసుకున్నా వాటినే మళ్ళీ పరిశీలించాలని ప్రభుత్వం చెప్పింది. గత ఏడాది ఆగస్టు 13 నుంచి ఈ నెల 16వ తేదీ వరకు కొత్త దరఖాస్తులు స్వీకరించింది. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వచ్చిన దరఖాస్తులను ప్రస్తుత దరఖాస్తులను క్రోడీకరించి పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మండల స్థాయి అధికారులు గతంలో దరఖాస్తు చేసుకున్న ఆశావాహులు మళ్ళీ దరఖాస్తు చేయనవసరం లేదని తెలిపారు. ఈ క్రమంలో ఆన్లైన్ లో ఉన్న పాత దరఖాస్తుల లెక్క తేలడం లేదు. ఒకవేళ గతంలో దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూకు వెళ్లని వారు మళ్ళీ కొత్తగా దరఖాస్తు చేసుకుంటే రెండ్రోజుల్లో వచ్చే అవకాశం ఉందని, కానీ పాతవాటిపైనే ఆధారపడి పింఛన్ వస్తుందనుకుని భరోసాతో ఉండేవారి పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గత వారం రోజుల క్రితం మొగుళ్లపల్లి మండలం అంకుషాపురం గ్రామంలో ఇదే పరిస్థితి ఎదురయింది గతంలో దరఖాస్తు చేసుకున్నవారు తమ దరఖాస్తులపై అధికారులు విచారణ చేపట్టడం లేదని భావించి మొగుళ్ళపల్లి ఎంపీడీవోను నిలదీశారు. ఆయన సమాధానం చెప్పక దాటవేయటంతో అంకుషాపురం గ్రామస్తుల్లో ఆందోళన మొదలైంది. ఆ గ్రామాన్ని సందర్శించిన పలువురు విలేకరులతో మాకు "పింఛన్ రాదా బాంచెన్" అని దీనంగా అర్థిస్తున్నారు. ఈ విషయంపై మొగుళ్లపల్లి ఎంపీడీవో "అక్షరదర్బార్" వివరణకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. మొగుళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన ముగ్గురు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా ముగ్గురు అనర్హులకు పింఛన్ జాబితాలో పేరు ఉన్నట్లు మండల వ్యాప్తంగా ప్రచారం జరుగుతుంది. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వాటిని కూడా పరిగణలోకి తీసుకొని అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేయాలని ప్రజలు కోరుకుతున్నారు

# పర్యాటకపోటీల్లో తాడిచర్ల విద్యార్థుల ప్రతిభ

- జిల్లా స్థాయిలో విజయదేవి కళాశాల విద్యార్థుల సత్తా



అక్షర దర్బార్ మల్హర్ : భూపాలపల్లి ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ టూరిజం క్లబ్ పోటీల్లో తాడిచర్లకు చెందిన విజయదేవి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. డాక్యుమెంటరీ విభాగంలో శివమణి, సందేశ్, ఈశ్వర్ విజయం సాధించగా, వ్యాసరచన పోటీల్లో బి. శ్వేత, హరిక విజేతలుగా నిలిచి ప్రథమ స్థానాల్లో నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి మార్గదర్శకత్వంలోనే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయిలో విజయం సాధించి కళాశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# కుంకుమేశ్వర ఆలయానికి రూ.5 కోట్లు

- కంచి కామకోటి పీఠాధిపతులను ఆహ్వానించిన ఎమ్మెల్యే రేవూరి



**అక్షరదర్బార్, పరకాల:**

పరకాల పట్టణంలోని ప్రసిద్ధ శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో మహారాజ గోపురాలు, ప్రాకార మండపం, మాడవీధుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఆలయ అభివృద్ధి పనులకు ఆశీస్సులు పొందేందుకు నిర్వాహకులు కంచి కామకోటి పీఠాధిపతులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ కొలుగూరు రాజేశ్వరరావు, శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ తమిళనాడులోని కాంచీపురం చేరుకుని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు కోరారు. రాబోయే కార్తీక మాసంలో పరకాలలో నిర్వహించనున్న శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలకు రావాల్సిందిగా స్వామివారికి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు వారికి ప్రత్యేక ఆశీస్సులు అందజేశారు.

# హైదరాబాద్‌కు దీటుగా వరంగల్

- ప్రజా ప్రభుత్వంలో నగరానికి కొత్త రూపు తీసుకొస్తాం
- బీజేపీ నాయకులు గాంధీ కుటుంబంపై వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒకటే..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ డీసీసీ భవనంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం రాత్రి 11 గంటల వరకు వరంగల్ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించామని, ప్రతి పనికి డెడ్‌లైన్ నిర్ణయించి ఎప్పటిలోగా పూర్తి చేయాలో దానిపై స్పష్టమైన టైమ్‌లైన్ రూపొందించామని తెలిపారు.

**కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి**

మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఆసుపత్రులు, ఫిల్టర్‌బెడ్, దేవాలయాల అభివృద్ధి తదితర కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే నెల దసరాలోపే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ల వేడుకలు, ఆర్ట్స్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారని వెల్లడించారు. మామునూరు విమానాశ్రయానికి గతంలో అవసరమైన అనుమతులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు విడుదల చేసి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిందన్నారు.

**-రాజకీయ విమర్శలపై మండిపాటు**

విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలన్నది ప్రజల అభిప్రాయాలతో నిర్ణయించుకోవచ్చని, దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని నాయిని విమర్శించారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రామ మందిరంలో చోరీకి పాల్పడిన దొంగలు బీజేపీ నాయకులేనని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒకటేనని ఎద్దేవా చేశారు. వరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు నాయకులు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని, గత పదేళ్లలో వరంగల్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

**తాగునీటి ప్రాజెక్టుకు రూ.550 కోట్లు**

నగరంలో 30-40 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సుమారు రూ.550 కోట్లతో తాగునీటి సరఫరా ప్రాజెక్టు తీసుకొచ్చామని నాయిని తెలిపారు. టెండర్లు పూర్తయి పనులు ప్రారంభమయ్యాయని, మెటీరియల్ కూడా సైట్‌కు చేరిందని అన్నారు. గత పాలనలో జరిగిన అవినీతి, ఆస్తుల వ్యవహారాలపై సంబంధిత నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ఆరోపణలు, రాజకీయ డ్రామాల కంటే వరంగల్ అభివృద్ధిపై చర్చకు రావాలని, తాము డేటాతో కూడిన పూర్తి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస రావు, ఎనుమాముల మార్కెట్ చైర్పర్సన్ పులి ప్రియాంక, కమలాపూర్ మార్కెట్ చైర్మన్ రాణి, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, విజయశ్రీ రజాలి, జక్కుల రవీందర్ యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ప్రగతి

- గీతాంజలి స్కూల్స్ డైరెక్టర్ కె. మమత రామకృష్ణ

అక్షర దర్బార్, మహబూబాబాద్ : విద్యార్థుల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ కె. మమత రామకృష్ణ అన్నారు. మంగళవారం మహబూబాబాద్‌లోని గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో పేరెంట్ టీచర్ మీటింగ్ (తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశం) ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల చదువు, పరీక్షల మార్కులు, క్రమశిక్షణ, ప్రవర్తన, భవిష్యత్ అభివృద్ధి గురించి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి చర్చించారు. తల్లిదండ్రులు సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి తమ పిల్లల చదువు పురోగతిని తెలుసుకున్నారు. స్కూల్ డైరెక్టర్ స్వయంగా తల్లిదండ్రులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేసి, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య నిరంతర సమన్వయం ఎంత అవసరమో వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి..

## ఆత్మహత్యకు కారకుడైన కామాంధుడికి యావజ్జీవ శిక్ష

- రూ.10 వేల జరిమానా విధించిన భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి
- విచారణ జరిపిన పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ

అక్షరదర్బార్, భూపాలపల్లి: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆమె ఆత్మహత్యకు కారణమైన నిందితుడికి భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. నిందితుడు గోల్కొండ రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఘటన పూర్వాపరాలు.. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మైనర్ బాలిక 2021 డిసెంబర్ 9న ఆధార్ కార్డు సవరణ కోసం కాటారం వెళ్లేందుకు ధన్వాడ బస్టాండ్ వద్ద వేచి ఉంది. అదే సమయంలో పరిచయస్తుడైన నిందితుడు రాజశేఖర్ మోటార్ సైకిల్‌పై వచ్చి బాలికను ఎక్కించుకున్నాడు. మార్గమధ్యలో ఆమెను బెదిరించి, చింతకాని క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న తన గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం కాటారం



సెంటర్‌లో ఆమెను దింపి, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు.

### మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

నిందితుడి ప్రవర్తనతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక కాటారంలో గడ్డి మందు సేవించి ఇంటికి వెళ్లింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందింది. బాలికకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఆమె బాబాయి సంరక్షణలో ఉండేది. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం ఎస్‌హెచ్‌ఓ (ఏఎస్‌ఐ) మహేందర్ కేసు నమోదు చేశారు.

### సాక్ష్యాధారాలతో నేరం రుజువు

అప్పటి కాటారం సీఐ రంజిత్ రావు కేసును వేగవంతం చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సమయంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జున రావు, ఎస్‌ఐ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్‌ఐ జి. వెంకన్న, కోర్టు కానిస్టేబుల్ కె. రమేష్ సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్. విష్ణువర్ధన్ రావు, జి. వెంకట్రామ్ బలమైన వాదనలు వినిపించారు. పోలీసుల దర్యాప్తులో సమర్పించిన ఆధారాలతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి యావజ్జీవ శిక్ష ఖరారు చేశారు. కేసును నిష్పాక్షికంగా, సమర్థవంతంగా దర్యాప్తు చేసి బాధితురాలికి న్యాయం చేకూర్చిన అధికారులను, కోర్టు సిబ్బందిని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రత్యేకంగా అభినందించారు.

# గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

- జీడబ్ల్యూఎంసీ పరిధిలో సుమారు 19 ప్రధాన చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు
- అందుబాటులో 30 క్రేన్లు, 145 మంది గజ ఈతగాళ్లు, 500 మంది సిబ్బంది
- పర్యవేక్షణకు ఇఃఛార్జిల నియామకం



అక్షరదర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బల్దియా కమిషనర్ టి వెంకన్న తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రత, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో సుమారు 8 వేల విగ్రహాలను నిమజ్జనం చేయడానికి హన్మకొండలోని బంధం చెరువు, సిద్ధేశ్వర గుండం, కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని భీమారం చెరువు, హసన్‌పర్తిలోని పెద్ద చెరువు, కాజీపేటలోని పరిగి కుంటతో పాటు వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి, ఉరుసుగుట్ట, రంగసముద్రం, రంగశాయిపేట, మామునూరు బెస్తం చెరువు, గీసుకొండలోని కట్టమల్లన్న చెరువు తదితర నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు, దీనికి తోడుగా చిన్నచిన్న చెరువుల్లో కూడా చిన్న విగ్రహాలు వేయుటకు ఏర్పాటుచేసినట్లు కమిషనర్ తెలిపారు.

### గుంతల పూడ్చివేత

వినాయక విగ్రహాలు నిమజ్జన కేంద్రాలకు సురక్షితంగా చేరుకునేలా ప్రధాన రహదారుల్లోని గుంతలను పూడ్చడంతో పాటు, రహదారుల వెంట ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించినట్లు తెలిపారు. నిమజ్జన కేంద్రాల పరిసరాల్లో బుష్ కటింగ్, పారిశుధ్య పనులు, చెరువుల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బల్దియా ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

నిమజ్జన సమయంలో భారీ విగ్రహాలను చెరువుల్లోకి తరలించేందుకు 30 క్రేన్లను అందుబాటులో ఉంచామని, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వివిధ నిమజ్జన కేంద్రాల వద్ద 145 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచినట్లు కమిషనర్ వెల్లడించారు. భక్తులు నీటిలోకి వెళ్లకుండా అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు, తెప్పలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### ప్రత్యేక అధికారులకు బాధ్యతలు

నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్‌ను ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు కమిషనర్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంతోష్ బాబును వరంగల్ ప్రాంతానికి, రవి కుమార్‌ను హన్మకొండ ప్రాంతానికి ఓవరాల్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజయ్ కుమార్‌కు అండర్ రైల్వే జోన్, ఉరుసుగుట్ట, అగర్తల చెరువుల నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ప్రతి నిమజ్జన కేంద్రం వద్ద డీఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏఈలు, కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు ఆయా కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, పరిస్థితులను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టేలా బాధ్యతలు కేటాయించినట్లు వివరించారు.

# బేరసారాలు!

- 41 అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసిన 881 మంది అభ్యర్థులు
- కొనసాగుతున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- ఊపందుకున్న పైరవీలు.. రంగంలోకి దళారులు
- పది మార్కుల ఇంటర్వ్యూ కోసం రూ.3 లక్షల రేటు
- భూపాలపల్లి జిల్లాలో ఓపెన్ గా సాగుతున్న దళారుల దందా!

అక్షరదర్బార్, హనుమకొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అంగన్వాడి టీచర్ల నియామకం కోసం బేరసారాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఒక్కో టీచర్ పోస్ట్ కోసం రూ.2 నుంచి రూ.3 లక్షల డిమాండ్ పలుకుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అంగన్వాడి టీచర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో కొందరు మధ్యవర్తుల ద్వారా అవగాహన కుదుర్చుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. భూపాలపల్లి జిల్లాలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో ఖాళీగా ఉన్న 41 అంగన్వాడి టీచర్ పోస్టుల కోసం గత ఆగస్టు 20న సంక్షేమ శాఖ నుంచి నోటిఫికేషన్ వెలువడింది. ప్రభుత్వాన్నిబంధనలో ప్రకారం ఈ 41 అంగన్వాడి టీచర్ల పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులకు కేటగిరి వారిగా రిజర్వ్ చేశారు. గత ఆగస్టు 21 నుంచే ఐసీడీఎస్ మహాదేవపూర్ ప్రాజెక్టు పరిధిలో 29, భూపాలపల్లి ప్రాజెక్టు పరిధిలో 12 అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 2న సాయంత్రం 5 గంటలకు ముగిసింది. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు రెండు ప్రాజెక్టుల పరిధిలో 881 మంది అంగన్వాడీ టీచర్ పోస్ట్ కోసం దరఖాస్తు చేశారు. మహదేవపూర్ ప్రాజెక్టు పరిధిలోని 29 పోస్టుల కోసం 604, భూపాలపల్లి ప్రాజెక్టు పరిధిలోని 12 పోస్టుల కోసం 277 దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా సంక్షేమ శాఖకు అందినట్లు తెలిసింది. ఈ దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సోమవారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఈ వెరిఫికేషన్ గురువారం వరకు కొనసాగనుందని సమాచారం.

### ఎంపిక విధానం..

అంగన్వాడీ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థి తప్పనిసరిగా స్థానిక మహిళ అయి ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో అయితే వార్డు గ్రామీణ ప్రాంతాల్లో అయితే అంగన్వాడి కేంద్రం కలిగిన గ్రామపంచాయతీ నివాసి అయి ఉండాలి. ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతి ఉత్తీర్ణులై, వయసు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు అంగన్వాడీ టీచర్ పోస్ట్‌కు దరఖాస్తు చేయడానికి అర్హులు. ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్ 70, ప్రత్యేక కేటగిరీ అయితే వితంతువులకు 5, అనాథలకు 10, దివ్యాంగులకు 5 మార్కులు, జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూ 10 మార్కులు. జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ చైర్మన్ గా కలెక్టర్, కన్వీనర్ గా జిల్లా సంక్షేమ అధికారి, సభ్యులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఆర్డీఓ ఉన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ 41 పోస్టుల్లో అంగన్వాడి టీచర్లను ఎంపిక చేయనుంది. అయితే జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూ ద్వారా లభించే 10 మార్కుల కోసం ప్రస్తుతం అభ్యర్థులు పైరవీల్లో తలమునకలైనట్లు తెలిసింది.

### -రంగంలోకి దళారులు-

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుండటంతో కొంతమంది దళారులు రంగంలోకి దిగినట్లు తెలిసింది. అంగన్వాడి టీచర్ గా ఎంపిక చేయిస్తామని పేర్కొన్నట్లు సమాచారం. పోటీ ఎక్కువగా ఉండటం వల్ల ఎలాగైనా అంగన్వాడీ టీచర్ పోస్ట్ దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్న అభ్యర్థుల్లో కొందరు దళారులను అప్రోచ్ అవుతున్నట్లు తెలిసింది ఈ క్రమంలో ఒక్కో టీచర్ పోస్టుకు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు డబ్బు చేతులు మారేలా బేరసారాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ దళారుల్లో సంక్షేమ శాఖలోని కొందరు ఉద్యోగుల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉన్నట్లు టాక్ వినపడుతుంది. ఈ వ్యవహారం వెనుక ఒక ఉన్నతాధికారి ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అంగన్వాడీ టీచర్ల ఎంపిక కోసం ముఖ్య ప్రజా ప్రతినిధుల నుంచి కూడా ఉన్నతాధికారులకు ఒత్తిళ్లు వస్తున్నట్లు కూడా తెలిసింది. అయితే దళారులను ఆశ్రయిస్తున్న అభ్యర్థుల్లో ముఖ్య ప్రజాప్రతినిధులు చెప్తున్న వారు కూడా ఉంటున్నట్లు సమాచారం.